సేవలు చకచకా..

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యానికి చెక్
- గతంలో విపరీతమైన ఆలస్యం
- సచివాలయ వ్యవస్థతో నాలుగు రోజుల్లోనే మంజూరు



కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు సిటీ: టీడీపీ హయాంలో ఫైళ్లు కదిలేవి కావు. నెలలు తరబడి కార్యాలయం చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరిగితే గానీ మోక్షం లభించేదికాదు. అడిగినంత ముట్టజెప్తే గానీ ధ్రువీకరణ పత్రాల జారీ ముందుకెళ్లేది కాదని దరఖాస్తుదారులు ఆరోపించేవారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం లభించింది. కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా సచివాలయ వ్యవస్థతో పనులు చకచకా జరుగుతున్నాయి.

త్వరితగతిన జారీ

నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 8 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రాల కోసం నాలుగు వేల మంది.. మరణ ధ్రువీకరణ పత్రాలకు రెండు వేల మంది ప్రతి నెలా దరఖాస్తు చేస్తుంటారు. వార్డు సచివాలయాలు, మీ సేవలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. వాస్తవానికి దరఖాస్తు చేసుకున్న ఏడు రోజుల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అధికారులు మంజూరు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం నాలుగు రోజుల్లోనే మంజూరు చేస్తున్నారు.

దళారీ వ్యవస్థకు నో చాన్స్

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలంటే గతంలో రూ.రెండు వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసేవారు. కార్పొరేషన్ కార్యాలయంలో దళారులు చేరి హెల్త్ విభాగ ఉద్యోగులతో కుమ్మక్కయ్యేవారు. అయితే ప్రస్తుతం దళారీ వ్యవస్థకు చెక్ పడింది. దీంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థతో సులభతరం

గతంలో 54 డివిజన్లకు ఒక హెల్త్ ఆఫీసర్, ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లు, 20 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తించేవారు. తమకు కేటాయించిన శానిటరీ పనులకే ఎక్కువ సమయాన్ని కేటాయించేవారు. ఫలితంగా పత్రాల జారీలో జాప్యం జరిగేది. అయితే సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక పరిస్థితులు మారాయి. 167 సచివాలయాలను ఏర్పాటు చేయడంతో అక్కడి శానిటరీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో జనన, మరణ అంశాలను నిర్ధారించుకొని త్వరితగతిన మంజూరు చేస్తున్నారు.

దళారీ వ్యవస్థ లేకుండా చేశాం



గతంలో దళారీలు కొందరు సామాన్యుల నుంచి భారీగా ముడుపులు తీసుకునేవారు. వీరికి ఏ మాత్రం అవకాశం లేకుండా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నాం. సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడు రోజుల్లో మంజూరు చేయాల్సి ఉన్నా, అంతకు ముందే జారీ చేయగలుగుతున్నాం.

– వెంకటరమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

క్లుప్తంగా

సీఎంను కలిసిన అనిల్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని సీఎం నుంచి ఆశీస్సులను అందుకున్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు 30 మందికి ఉగాది పురస్కారాలను శనివారం అందజేయనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమందిరంలో నిర్వహించనున్న కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని నిర్బంధించి అతనిపై హత్యాయత్నం చేసిన దంపతులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వనంతోపులో రామ్మోహన్‌రెడ్డి తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నారు. అతని ఇంటి పక్కనే మునిరెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. వీరు సన్నిహితంగా ఉండేవారు. అవసరాల నిమిత్తం రామ్మోహన్‌రెడ్డి వద్ద రూ.ఎనిమిది లక్షలను అప్పుగా రెండేళ్ల క్రితం మునిరెడ్డి తీసుకొని ప్రామిసరీ నోట్లను రాసిచ్చారు. కొంతకాలంగా అప్పు తాలూకు నగదును చెల్లించాలని రామ్మోహన్‌రెడ్డి కోరగా, ఆయన సమాధానం చెప్పలేదు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు మునిరెడ్డి గురువారం తెల్లవారుజామున వెళ్తూ నగదును తన చేతికిచ్చారని.. ప్రామిసరీ నోట్లను తీసుకొని తన ఇంటికి రావాలని ఆయన భార్య రామ్మోహన్‌రెడ్డికి మెసేజ్ చేశారు. దీంతో ఇంటికి రామ్మోహన్‌రెడ్డి వెళ్లగా, అక్కడ మునిరెడ్డి, అతని భార్య బాధితుడి కాళ్లు, చేతులు కట్టేసి నిర్బంధించారు. ప్రామిసరీ నోట్లను చించేసి, అతనిపై కర్రతో, ఇనుపరాడ్‌తో దాడి చేశారు. గాయపడిన రామ్మోహన్‌రెడ్డి పెద్దగా కేకలేయడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించి వదిలేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు.

15 మంది కాంట్రాక్ట్ సిబ్బంది నియామకం

నెల్లూరు(క్రైమ్): పోలీస్ శాఖలో 15 మందిని కాంట్రాక్ట్ పద్ధతిపై డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమిస్తూ ఎస్పీ విజయారావు ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. వీరిలో 13 మంది డ్రైవర్లు కాగా, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు.

ప్రభుత్వ సేవలను లబ్ధిదారులకు అందించాలి

కొడవలూరు: సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను లబ్ధిదారులకు సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సిబ్బందికి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం, రామన్నపాళెం, ఆలూరుపాడు సచివాలయాలను గురువారం జేసీ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? లేదా ? అని పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ద్వారా అందే సేవలు ప్రజలకు సకాలంలో అందిస్తున్నారా అని ఆరా తీశారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్లు నాటే కార్యక్రమం జరుగుతున్నందున రైతుల సమక్షంలో హద్దు రాళ్లు నాటాలని తెలిపారు. కరోనా నూతన వేరియంట్ ప్రబలుతున్నందున సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్ కుమార్, జాలయ్య, విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక కృషి

కోవూరు: రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. మండలంలోని లేగుంటపాడు ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రోసెస్ ఆర్గనైజేషన్)ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న ప్రతి పథకాన్ని రైతులకు చేరువ చేయడంలో ప్రత్యేక చొరవ చూపుతున్నామని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ఏ సీజన్‌లో ఏ పంటలు పండుతున్నాయో అందుకు అవసరమైన సూచనలు, సలహాలను రైతులకు అందిస్తూ వారికి ఉపయోగపడే విధంగా పుస్తకాలను ముద్రించి అందజేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు విషయంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ముడిసరుకులు అందుబాటులో ఉండడం వల్ల పరిశ్రమలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలోనే లేగుంటపాడు ఎఫ్‌పీఓకు ప్రత్యేక గుర్తింపు ఉందని, దాని ద్వారా దాదాపు 1500 మంది రైతులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు.

జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు



బ్యాటింగ్ చేస్తున్న చక్రధర్‌బాబు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడారు. నిత్యం వృత్తి బాధ్యతతో బిజీగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. కోవిడ్ సమయంలో జర్నలిస్టులు అందించిన సహాయ సహకారాలను ప్రశంసించారు. అనంతరం నుడా చైర్మన్, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ద్వారకానాథ్ మాట్లాడారు. వచ్చే ఏడాది రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించేందుకు సింహపురి స్పోర్ట్స్ అసోసియేషన్ తరఫున తమ వంతు సహకారాన్ని అందిస్తానని పేర్కొన్నారు. నాకౌట్ పద్ధతిలో 12 జట్లు తలపడుతున్నాయని జేశాప్ జిల్లా అధ్యక్షుడు నందకిషోర్ తెలిపారు. సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్, చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, సుజయ్‌బాబు, స్టేట్ జాయింట్ సెక్రటరీ నరేష్‌కుమార్, జిల్లా సెక్రటరీ సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు..

గూడూరు – సర్వేపల్లి మధ్య జరిగిన పోటీల్లో గూడూరు, కెమెరామెన్స్ – కావలి జట్ల మధ్య జరిగిన పోటీల్లో కెమెరామెన్స్ జట్లు విజయం సాధించాయి. మూడో మ్యాచ్‌లో సర్వేపల్లి – ఉదయగిరి జట్లు తలపడగా, సర్వేపల్లి జట్టు గెలుపొందింది.

ఆశ కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలని వినతి



నెల్లూరు (అర్బన్): ఉదయగిరి మండలం దేవరపల్లిలో ఆశ కార్యకర్తగా పనిచేస్తున్న శ్రీవాణిని విధుల్లోకి తక్షణమే తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్య దర్శి అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని సీఐటీయూ నేతలు గురువారం సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నేత పెంచలనర్సయ్య, పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి





నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్య్రం కోసం అసువులుబాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ నగరాధ్యక్షుడు ప్రసాద్ కోరారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. 54వ డివిజన్లోని భగత్‌సింగ్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగరాధ్యక్షుడు ప్రసాద్, నేతలు శశి, జాఫర్, సురేష్, జయరామ్, కృష్ణ, మస్తాన్, మాబాషా, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (వేదాయపాళెం): భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని అపోలో ఆస్పత్రి సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని డీవైఎఫ్‌ఐ, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, 17వ డివిజన్ శాఖ కార్యదర్శి సతీష్, అవెన్యూ స్కూల్ అధినేత కృష్ణ చైతన్య, కార్పొరేటర్ అశోక్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- స్వాతంత్య్ర పోరాటంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చేసిన త్యాగాలు ఎనలేనివని పీడీఎస్‌ఓ జిల్లా నేత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకొని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించాలని కోరుతూ గాంధీబొమ్మ, కనకమహల్, తదితర ప్రాంతాల్లో ప్రదర్శనను పీడీఎస్‌ఓ – ఎస్‌వైఎస్ సంఘాల కార్యకర్తలు నిర్వహించారు. శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను ఆరాతీస్తున్న గౌరి

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 21వ డివిజన్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ గౌరి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో గురువారం పర్యటించిన ఆమె స్థానికులను అడిగి సమస్యలను ఆరాతీశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులను చేపడతామని వివరించారు.

సైలెన్సర్లపై కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



నెల్లూరు(క్రైమ్): అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లను వినియోగిస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. అధిక శబ్దం చేస్తున్న పలు బైక్‌ల సైలెన్సర్లను అయ్యప్పగుడి సెంటర్ వద్ద గురువారం తొలగించి బైక్ యజమానులకు అపరాధ రుసుమును విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ మాట్లాడారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను వినియోగిస్తున్న వాహనచోదకులపై చర్యలు చేపడతామని చెప్పారు. అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లను బిగిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సౌత్ ట్రాఫిక్ ఆర్‌ఐ రమణారెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, ఎస్సై రంగనాథ్‌గౌడ్, ఆర్ఎస్సై చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కమిషనర్ హరిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 27న దరఖాస్తుల పరిశీలన, 28, 29వ తేదీల్లో ఇంటర్వ్యూలను కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నామని చెప్పారు. ఎంపికైన వారికి ఏప్రిల్ ఒకటిన పోస్టింగ్‌లను ఇవ్వనున్నామని పేర్కొన్నారు. gramawardsachivalayam. ap. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆదివాసీ గ్రామాలపై దాడులు తగవు

నెల్లూరు(బారకాసు): ఛత్తీస్‌ఘడ్ – తెలంగాణ సరిహద్దుల్లోని ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులను వెంటనే ఆపాలని పౌర హక్కుల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అబ్బాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. సీడీఆర్వో ఆధ్వర్యంలో 14 మంది సభ్యులతో ఏర్పడిన జాతీయ నిజ నిర్ధారణ కమిటీ బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి వాస్తవాలను సేకరించిందని చెప్పారు. న్యాయవాది బ్రహ్మం, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. గతేడాది డిసెంబర్ 27 నుంచి గురువారం వరకు రూ.6,38,093 మేర కానుకలను భక్తులు సమర్పించారని ఈఓ వేణుగోపాల్ తెలిపారు. దేవదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య పర్యవేక్షించారు.

జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాలి

నెల్లూరు (అర్బన్): దేశంలో జర్నలిస్టులపై దాడులను ఆపాలని.. జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సేవ్ జర్నలిజం డేను పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రదర్శనను పలువురు పాత్రికేయులు గురువారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్, రామ్మూర్తి, హనోక్, తదితరులు పాల్గొన్నారు.

26న కవి సమ్మేళనం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఉగాది పురస్కారాల ప్రదానం, జాతీయ స్థాయి కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నామని రచయితల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, అన్నపూర్ణ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో గురువారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పలువురు సాహితీవేత్తలు, కవులు, తదితరులను సత్కరించనున్నామని పేర్కొన్నారు. రత్నప్రసాద్, అరుణకుమారి, నజ్మా, హనోక్, భారతి, శ్రీమన్నారాయణ, నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి



నెల్లూరు(క్రైమ్): అధికారులు, సిబ్బంది విధిగా హెల్మెట్‌ను ధరించాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. కలువాయి మండలం చవటపల్లి సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమశిల హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు మృతి చెందిన నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది హెల్మెట్లను తప్పక ధరించాలని ఎస్పీ విజయారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది హెల్మెట్లను ధరించి వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ మీదుగా ర్యాలీని నిర్వహించారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, సౌత్ ట్రాఫిక్ ఆర్‌ఐ రమణారెడ్డి, ఎస్సైలు గీతారమ్య, రంగనాథ్‌గౌడ్, రహీమ్, ఆర్ఎస్సైలు చంద్రమౌళి, తిరుమలరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరెడ్డి బాధ్యతలను గురువారం స్వీకరించారు. రేంజ్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. రూరల్ సీఐగా పనిచేసిన వెంకటరెడ్డిని రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. కాగా రూరల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తగు చర్యలు చేపడతానని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను గురువారం బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర రెడ్డి మాట్లాడారు. విజయవాడకు చెందిన న్యాయవాది వెంకటభగవాన్‌పై భవానీపురం ఇన్‌స్పెక్టర్ నమోదు చేసిన తప్పుడు కేసుపై విజయవాడ పోలీస్ అధికారులు విచారణ జరిపి సంబంధిత అధికారిని వీఆర్‌కు పంపారని ఆయన చెప్పారు.

ఘనంగా ఎమ్మెల్యే అనిల్ జన్మదినం



అనిల్ కటౌట్‌కు క్షీరాభిషేకం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ జన్మదిన వేడుకలను నగరంలో గురువారం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద 50 అడుగుల కటౌట్‌కు క్షీరాభిషేకాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నేత కిషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం క్రేన్‌తో భారీ పూల మాల వేసి 100 కిలోల కేక్‌ను కట్ చేశారు. సంతపేటలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద 501 టెంకాయలను యువజన విభాగ నగరాధ్యక్షుడు జయకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొట్టి ప్రత్యేక పూజలను నిర్వహించారు. నర్తకి సెంటర్ వద్ద కేక్‌ను కట్ చేసి పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, సాయికృష్ణ, సాకేష్‌రెడ్డి, ఆనంద్, పవన్, సాయి, దీపు, లతీష్, శంకర్, హేమంత్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని అలంకార్ సెంటర్ వద్ద కేక్‌ను కట్ చేసి అన్నదానాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, పార్టీ నేతలు సునీల్, షంషీర్, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.
- ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్‌లో కేక్‌ను 46వ డివిజన్ కార్పొరేటర్ ఉమామహేష్ ఆధ్వర్యంలో కట్ చేశారు. అనంతరం డివిజన్లోని మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు, క్రికెట్ కిట్లను అందజేశారు. గాంధీబొమ్మ వద్ద గల సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మోహన్‌రావు, కిషోర్, రఘు, రాము, లక్ష్మణ, బాషా, కృష్ణ, ప్రభాకర్, ధనుంజయ, నాగరాజు, హజరత్‌బాబు, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: నగరంలోని 48వ డివిజన్లో పలు సేవా కార్యక్రమాలను పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. పార్లుకట్ట ప్రాంతంలో అన్నదానం చేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మీరా, కార్పొరేటర్ కరిముల్లా, నేతలు వాణి, హాజీ, అస్లామ్, సురేష్, అబీద్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గాంధీ గిరిజన కాలనీలో గల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద 101 టెంకాయలను పార్టీ నేత వెంకటరమణ ఆధ్వర్యంలో కొట్టారు. అనంతరం అనిల్‌కుమార్ భారీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేసి.. పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. వెయ్యి మందికి అన్నదానాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ సుజాత, 53, 54వ డివిజన్ల పార్టీ ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అశోక్, నేతలు ఆదిశేషమ్మ, రవి, ఖాజా, నరసింహ, నాగరాజు, ప్రకాష్, శ్రీనివాసులురెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

- వెంకటేశ్వరపురం సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నేతలు అశోక్, శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, బ్రహ్మారెడ్డి, శివకుమార్, వెంగళరెడ్డి, ప్రసాద్, బాలురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సహదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిధర్‌రెడ్డి అక్రమ ఆస్తులపై విచారణ జరపాలి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అక్రమ ఆస్తులపై సమగ్ర విచారణ జరపాలని నెల్లూరు రూరల్ బూత్ కమిటీల ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో గల టాగూర్ ఆడిటోరియ ఆవరణలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. గిరిధర్‌రెడ్డి అక్రమ ఆస్తులపై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి పూర్తి ఆధారాలతో నివేదికను పంపనున్నానని చెప్పారు. అన్ని వర్గాల వారిని భయభ్రాంతులకు గురిచేసి కోట్లాది రూపాయలను దండుకున్నారని ఆరోపించారు.

సింహపురి కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. సింహపురి కాలనీలో నివాసం ఉంటున్న షాకిరా తోటపల్లిగూడూరు మండలంలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తన ఇద్దరు పిల్లలతో కలిసి పక్క వీధిలో ఉన్న తన అక్క ఇంటికి బుధవారం రాత్రి వెళ్లి అక్కడే నిద్రించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాను పగలగొట్టారు. అందులో ఉన్న రూ.రెండు లక్షల విలువజేసే ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, 800 గ్రాముల వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. ఇంటికి గురువారం సాయంత్రం వచ్చిన బాధితులు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రెహ్మాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ విజయారావు సూచించారు. ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు గుండెపోటుతో ఇటీవల మృతి చెందడంతో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. ఆరోగ్యపరంగా పాటించాల్సిన జాగ్రత్తలపై గుంటూరుకు చెందిన ప్రముఖ నెఫ్రాలజిస్ట్ రామకృష్ణతో అవగాహన కల్పించారు.